క్లుప్తంగా

అమ్మవారికి బోనాలు



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మవారికి శుక్రవారం గ్రామానికి చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో ఊరేగింపుగా తరలివెళ్లి పాలుపొంగళ్లతో బోనాలు సమర్పించారు.అనంతరం మండపంలో ఆలయ వేద పండితులు వారికి ఆశీర్వచనం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ జంగం శ్రీనివాసరావు, ఆలయ మాజీ చైర్మన్ వాసిరెడ్డి జెనర్థి, ధర్మకర్త బెజవాడ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నందిగామరూరల్: తొర్రగుడిపాడులోని 33/11 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల దృష్ట్యా శనివారం పలు గ్రామాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ నందిగామ రూరల్ ఏఈ పూర్ణచంద్రరావు శుక్రవారం తెలిపారు. మండలంలోని పల్లగిరి, సోమవరం, రుద్రవరం, రాఘవాపురం, కమ్మవారిపాలెం, కొండూరు, మాగల్లు, గోళ్లమూడి, రామిరెడ్డిపల్లి, జొన్నలగడ్డ, దాములూరు, కొణతమాత్మకూరు గ్రామాల్లో ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు వివరించారు. వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

ధనలక్ష్మి అలంకారంలో ఈశ్వరీమాత



జగ్గయ్యపేట: శ్రావణ మాసం మూడవ శుక్రవారం సందర్భంగా పలు ఆలయాలలో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. పట్టణంలోని ఈశ్వరీమాత ఆలయంలో అర్చకుడు సాయిచార్యులు అమ్మవారిని కరెన్సీ నోట్లతో ధనలక్ష్మిదేవిగా అలంకరించారు. అనంతరం మహిళలు కుంకుమ పూజలు చేశారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన



జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని 9వ వార్డులో రూ.10 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీరోడ్డుకు ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర శుక్రవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో 9వ వార్డు కౌన్సిలర్ పేరం సైదేశ్వరరావు, ఇతర కౌన్సిలర్లు, మున్సిపల్ ఉద్యోగులు, స్థానికులు పాల్గొన్నారు.

251 మందికి వైద్యపరీక్షలు



జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని జెడ్పీ బాలికల హైస్కూల్‌లో జయప్రద ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 251మందికి వైద్యులు పరీక్షలు చేసి అవసరమైనవారికి మందులు పంపిణీ చేశారు. 141 మందికి కంటి పరీక్షలు, 39 మందికి దంతపరీక్షలు, 71మందికి సాధారణ వైద్యపరీక్షలు చేసినట్లు జయప్రద ఫౌండేషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్సీ తొండపు దశరథ జనార్దన్ తెలిపారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ గొట్టె నాగరాజు, టీడీపీ పట్టణ ప్రధానకార్యదర్శి మైనేని రాధా, మెడికల్ క్యాంపు కోఆర్డినేటర్ కట్టా నరసింహారావు, ఏఎన్ఎంలు, ఆర్పీలు, ఆశాకార్యకర్తలు వాగ్దేవి నర్సింగ్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

వాసవీమాతకు సారె సమర్పణ



నందిగామరూరల్: పట్టణంలోని శ్రీచక్ర మందిరంలో వేంచేసియున్న వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారికి శ్రావణమాసం సందర్భంగా రెలయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ కొప్పు మురళీకృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం సారె సమర్పించారు. పసుపు, కుంకుమ, గాజులు, పూలు, పండ్లు, చీర, జాకెట్‌లతో కూడిన సారెను ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు మారం అమరయ్య, కేతేపల్లి పవన్, సముద్రాల సాయి, పబ్బతి రాజేష్, చల్లా ఆనంద్, పెద్దసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

వైఎస్ విగ్రహం తొలగింపుపై నేతలు ఫైర్

అధికారులపై కేసు నమోదుకు డిమాండ్



సీఐ నాయుడికి వినతిపత్రం అందజేస్తున్న దేవినేని అవినాష్, డాక్టర్ జగన్‌మోహనరావు తదితరులు

నందిగామటౌన్: నందిగామలో గురువారం రాత్రి చట్టాన్ని ఉల్లంఘించి పట్టణ నడిబొడ్డున ఉన్న దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని తొలగించిన మున్సిపల్ కమిషనర్, ఏఈలపై కేసు నమోదు చేయాలని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా కన్వీనర్ దేవినేని అవినాష్ డిమాండ్ చేశారు. వైఎస్ విగ్రహాన్ని తొలగించడాన్ని నిరసిస్తూ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు గాంధీసెంటర్‌కు నిరసన ర్యాలీ చేశారు. ఈసందర్భంగా అవినాష్ మాట్లాడుతూ పోలీస్ పహారాలో ఈ దారుణ చర్యకు పాల్పడ్డారని మండిపడ్డారు. అత్యంత నాణ్యమైన సీసీ కెమెరాలున్నాయని వాటి పుటేజీలు తీసి విగ్రహాన్ని తీసిన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో ఏనాడు కక్షపూరిత చర్యలకు తావులేని నందిగామలో ప్రస్తుతం విష సంస్కృతికి తెర తీశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి పాలకులు అక్రమ సంపాదనలో వాటాల కోసం తన్నుకోవడం తప్ప నియోజకవర్గ అభివృద్ధికి చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు. విగ్రహాలు తొలగించిన అధికారులు, నేతలను చట్టం ముందు నిలబెట్టి తీరుతామని దేవినేని హెచ్చరించారు.

అధికారంలోకి వచ్చినప్పటి నుంచే విధ్వంసం.. డాక్టర్ జగన్‌మోహనరావు..

తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన మరుసటి రోజే నందిగామలో విధ్వంసక పాలనకు తెరతీశారని ముఖ్యంగా 13 నెలలుగా ఉగ్రవాద రాజకీయాలు.. ఉగ్రవాద పాలన సాగుతోందని నందిగామ మాజీ శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. అభివృద్ధి పనుల శిలాఫలకాలను సైతం ధ్వంసం చేశారని గుర్తుచేశారు. రెవెన్యూశాఖ పరిధిలో ఉన్న వైఎస్సార్ విగ్రహాన్ని మున్సిపల్ అధికారులు ఎలా తీస్తారని ఆయన ప్రశ్నించారు. వ్యక్తిగత కక్షలంటే మాపై చూపించాలి తప్ప ప్రజలపై, విగ్రహాలపై చూపించడం మంచిపద్ధతి కాదని హితవు పలికారు. కూటమి పాలనలో ఊరి బయట ఉన్న మందు కొట్లను ఊరిలోకి తీసుకురావటం తప్ప చేసింది శూన్యమన్నారు. చంద్రబాబు రెడ్‌బుక్ రాజ్యాంగం రాయమని అపర మేధావి, లోకేష్‌కు అప్పగించారని, కూటమి నేతల తప్పులను ప్రశ్నించేవారిని లోకేస్ రాసిన రెడ్‌బుక్ రాజ్యాంగంతో ఇబ్బంది పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటువంటి దుశ్చర్యలను మానుకోవాలని హెచ్చరించారు.

కోర్టు ఆదేశాలు బేఖాతరు.. నల్లగట్ల స్వామిదాసు, తిరువూరు సమన్వయకర్త..

ఉన్నత న్యాయస్థానం ఆదేశాలను సైతం లెక్క చేయకుండా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని తొలగించటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తిరువూరు నియోజకవర్గ సమన్వయకర్త నల్లగట్ల స్వామిదాసు పేర్కొన్నారు. రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని తొలగించినంత మాత్రన ప్రజల హృదయాలలో ఆయన స్థానాన్ని చెదరగొట్టలేరని తెలిపారు. రాష్ట్రంలో సాగుతున్నది సుపరిపాలనలో.. దుష్ట పరిపాలనలో ప్రజలు నిర్ణయిస్తారని చెప్పారు. ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కుతూ అప్రజాస్వామిక పాలన సాగిస్తున్నారని మండిపడ్డారు. పేదల సంక్షేమాన్ని విస్మరించిన అధికార పార్టీ నాయకులకు ప్రజలు బుద్ధి చెప్పటం ఖాయమని రాబోయే ఏ ఎన్నికలలోనైనా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఘన విజయం తథ్యమన్నారు. ప్రజలకు మొహం చూపించుకోలేని పరిస్థితిలో అధికార పార్టీ నేతలున్నారని చెప్పారు.

వైఎస్సార్ పేదల గుండె చప్పుడు.. పూనూరు గౌతమ్‌రెడ్డి, ట్రేడ్ యూనియన్ కన్వీనర్..

వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రజల గుండె చప్పుడు అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కన్వీనర్ పూనూరు గౌతమ్ రెడ్డి పేర్కొన్నారు. పేదల సంక్షేమానికి పెద్దపీట వేసిన దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని పునఃప్రతిష్ట చేసే బాధ్యత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తీసుకుంటుందని తెలిపారు. విగ్రహాలను ధ్వంసం చేయడం కాదని నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిపై చర్చకు రావాలని సవాల్ విసిరారు. చట్టానికి వ్యతిరేకంగా అధికార దుర్వినియోగం చేస్తూ విగ్రహాలు తొలగించడం సరైన పద్ధతి కాదన్నారు. సుప్రీంకోర్టు, కేంద్ర ప్రభుత్వం విగ్రహాల విషయంలో యాగీ చేయొద్దని చెబుతున్నా వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని అవమానకరంగా తొలగించడం హేయమైన చర్యన్నారు. అధికార మదంతో ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నవారు భవిష్యత్‌లో తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు.

చెత్తకుప్పల మధ్యన పైలాన్



మధిర రోడ్డులో చెత్తకుప్పల మధ్యన పడేసిన నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు పైలాన్

నందిగామటౌన్: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని తొలగింపజేసిన అధికారపార్టీ నాయకులు, కార్యకర్తలు గాంధీసెంటరులోని వైఎస్సార్ విగ్రహం పక్కన ఏర్పాటు చేసిన పైలాన్‌ను సైతం గురువారం అర్ధరాత్రి ధ్వంసం చేశారు. పైలాన్‌ను మధిర రోడ్డులోని మునేటి సమీపంలో చెత్త కుప్పల మధ్యన పడేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నవరత్నాలు- పేదలందరికీ ఇళ్ల కార్యక్రమంలో భాగంగా అర్హులైన నిరుపేదలందరికి ఇళ్ల పట్టాలను పంపిణీ చేసి అందుకు గుర్తుగా ఈ పైలాన్‌ను ఏర్పాటు చేశారు. పైలాన్‌ను ధ్వంసం చేసిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజలు కోరుతున్నారు.


ఎమ్మెల్యే సౌమ్యకు బహిరంగలేఖ



బహిరంగ లేఖను విడుదల చేస్తున్న బీఎస్పీ నాయకుడు బర్రె ఉదయ్‌కిరణ్

నందిగామ రూరల్: ప్రజలు అధికారాన్ని కట్టబెట్టింది కక్ష సాధింపులకు పాల్పడేందుకు కాదని కంచికచర్ల ఎంపీటీసీ సభ్యుడు, బీఎస్పీ నాయకుడు బర్రె ఉదయ్‌కిరణ్ పేర్కొన్నారు. నందిగామలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని గురువారం అర్ధరాత్రి మున్సిపల్ అధికారులు తొలగించిన నేపథ్యంలో ఎమ్మెల్యే, విప్ తంగిరాల సౌమ్యకు శుక్రవారం ఆయన బహిరంగలేఖ రాశారు. విగ్రహ రాజకీయాల పెనుగులాటలో నియోజకవర్గ అభివృద్ధి కుంటుపడుతోందని అభ్యంతరం వ్యక్తంచేశారు. కక్ష రాజకీయాలు మానుకుని నియోజకవర్గ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు. అధికారాన్ని అడ్డంపెట్టుకుని విగ్రహాల తొలగిస్తూ ప్రజాధనాన్ని వృధా చేస్తున్నారన్నారు. ఇటువంటి చర్యలు ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగమౌలిక విలువలకు అంత మంచిది కాదని పేర్కొన్నారు. ప్రభుత్వాస్పత్రిలో వసతులు లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారని, నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో మంచినీటి వసతి లేక ప్రజలు అవస్థలుపడుతున్నందున ఇటువంటి విషయాలపై దృష్టిసారించి ప్రజాసమస్యలు పరిష్కరించాలని కోరారు. ప్రజాప్రతినిధులకు విగ్రహాల తొలగింపుపై ఉన్న శ్రద్ధ ప్రజాసమస్యల పరిష్కారంపై లేకుండాపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కక్షపూరిత రాజకీయాలను పక్కనపెట్టి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే సౌమ్యను కోరారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న మునేరు



కీసర వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న మునేరు

కంచికచర్ల: డివిజన్‌లో కురుస్తున్న వర్షాలతోడు ఎగువ ప్రాంతాలైన తెలంగాణ రాష్ట్రం ఖమ్మం, వైరా, వరంగల్ తదితర ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు కీసర మునేరుకు భారీగా వరదనీరు చేరుతోంది. కీసర మునేరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో నదీతీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ సీహెచ్ నరసింహారావు శుక్రవారం సూచించారు. పశువులను కూడా నదిలో తోలుకెళ్లరాదని రైతులను కోరారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీవ్రతాలు



జగ్గయ్యపేటలోని వెండి మహాలక్ష్మి ఆలయం వద్ద సామూహిక కుంకుమార్చన చేస్తున్న మహిళలు



వరలక్ష్మిగా దర్శనమిచ్చిన కన్యకాపరమేశ్వరి అమ్మవారు

జగ్గయ్యపేట అర్బన్: శ్రావణమాస మహోత్సవాలలో భాగంగా పట్టణంలోని అమ్మవారి ఆలయాలకు మూడవ శుక్రవారం సందర్భంగా భక్తులు పోటెత్తారు. స్థానిక అద్దాల బజారులో ఉన్న శ్రీమహాలక్ష్మి అమ్మవారి వెండిదేవాలయం, నకాశిబజారులోని శ్రీకనకదుర్గ ఆలయం, దుర్గాపురంలోని శ్రీదుర్గామల్లేశ్వర స్వామి ఆలయం, అయ్యప్పనగర్ అయ్యప్పస్వామి ఆలయంలోని అష్టలక్ష్మి సహిత వైభవలక్ష్మి తదితర ఆలయాలను భక్తులు పెద్దసంఖ్యలో సందర్శించి పూజలు చేశారు. మహలక్ష్మి, శ్రీకనకదుర్గ అమ్మవార్లు శ్రీధనలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, సామూహిక వరలక్ష్మీ వ్రతాలు చేశారు. వెండిదేవాలయం ఆలయ కమిటీ చైర్మన్ అత్తులూరి వెంకటేశ్వర్లుతో ఆయా ఆలయాల కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

శాకంబరిగా నాగసత్యమ్మ...


పట్టణ సమీపంలోని విశాఖ స్టీల్ ప్లాంట్ జగ్గయ్యపేట లైమ్ స్టోన్‌మైన్స్ క్వార్టర్స్ వద్ద ఉన్న నాగసత్యమ్మ అమ్మవారు శాకంబరిగా దర్శనమిచ్చారు. వరలక్ష్మి శుక్రవారం సందర్భంగా అర్చకులు టీఎల్ఎన్ ఆచార్యులు, కృష్ణ భరద్వాజ్ కలిసి అమ్మవారిని వివిధ రకాల కూరగాయలు, పండ్లతో శాకంబరిగా అలంకరించి పూజలు చేశారు. జేఎల్ఎం ఇన్‌చార్జి కిరణ్‌కుమార్, వీఎస్‌పీ జేఎల్ఎం ఉద్యోగులు, ప్రముఖులు పాల్గొన్నారు.

వత్సవాయి మండలంలో..

వత్సవాయి: శ్రావణమాస వరలక్ష్మి వ్రతాన్ని మహిళలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయాన్నే మహిళలు లక్ష్మీదేవికి పాలపొంగళ్లు పెట్టి ప్రత్యేక పూజలు చేశారు. మక్కపేటలోని శ్రీ కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం, వత్సవాయిలోని శ్రీ వాసవీకన్యకాపరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కన్యకాపరమేశ్వరి అమ్మవారి వరలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అధికసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని అభిషేకాలు చేశారు.

ముంచెత్తిన వాన

- డివిజన్‌లో 422 మి.మీ వర్షపాతం
- పెనుగంచిప్రోలులో 325.2 వర్షపాతం నమోదు
- పొంగిపొర్లుతున్న వాగులు
- మునేటికి భారీగా వరదనీరు
- నీటిమునిగిన పంటపొలాలు



పెనుగంచిప్రోలు చెరువు నిండి అలుగు గుండా ప్రవహిస్తున్న వరద నీరు



మక్కపేట: పత్తిచేనులో నిలిచిన వర్షపు నీరు

పెనుగంచిప్రోలు/నందిగామరూరల్/వత్సవాయి: నందిగామ డివిజన్‌లోని నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల పరిధిలో గురువారం రాత్రి 422 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. దీంతో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. పెనుగంచిప్రోలు మండలంలోని అనిగండ్లపాడు, ముచ్చింతాల తదితర గ్రామాల్లో పంట పొలాలు నీటమునిగాయి. పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. జగ్గయ్యపేట నియోజకవర్గంలో 325.2 మి.మీ వర్షపాతం నమోదుకాగా, నందిగామ నియోజకవర్గంలో 96.8 మి.మీ వర్షం కురిసింది. పెనుగంచిప్రోలు మండలంలో అత్యధికంగా 148.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. నందిగామ మండలంలో 59.2 మి.మీ., కంచికచర్ల మండలంలో 18.6 మి.మీ., చందర్లపాడు మండలంలో 10.8మి.మీ., వీరులపాడు మండలంలో 8.2మి.మీ., జగ్గయ్యపేట మండలంలో 110.2 మి.మీ., వత్సవాయి మండలంలో 66.8మి.మీ వర్షం కురిసినట్లు ఉపగణాంకాధికారి ప్రసాద్ శుక్రవారం తెలిపారు.

వత్సవాయి మండలంలో..

వత్సవాయి: మండలంలో గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. పదిరోజులుగా కాస్తున్న ఎండలకు ప్రజలు ఉక్కపోతతో అల్లాడుతున్న నేపథ్యంలో కురిసిన వర్షం రెండుగంటలపాటు దంచికొట్టింది. దీంతో పల్లపు పొలాలన్నీ నీటిలో ఉన్నాయి. ఈ వర్షంతో రైతులు కొంత ఊపిరిపీల్చుకున్నారు. పత్తిచేలో వర్షపునీరు నిలిస్తే పంట ఎర్రబడే అవకాశం ఉన్నందున వర్షపు నీటిని బయటకు పంపించి తేమ తగ్గడానికి యూరియాను చల్లుకోవాలని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు. మునేటికి ఎగువప్రాంతాలలో కూడా వర్షం పడటతో మునేటికి వరదనీరు భారీగా చేరింది. 6.5 అడుగుల మేర వరదనీరు వస్తున్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు.



ముచ్చింతాల వద్ద చెరువును తలపిస్తున్న పొలాలు



అనిగండ్లపాడు వద్ద నీట మునిగిన పొలాలు



ముచ్చింతాల-తాళ్లూరు వాగు చప్టాపై వరద నీరు

అమ్మవార్లకు సామూహిక కుంకుమార్చనలు



నందిగామలో వాసవీమాతకు కుంకుమార్చన చేస్తున్న మహిళా భక్తులు

నందిగామరూరల్: మండలంలోని ఆయా దేవీ ఆలయాలలో శ్రావణవాస ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శ్రావణ మాసం మూడవ శుక్రవారం సందర్భంగా ఆలయాలలో పూజలతోపాటు వరలక్ష్మీ వ్రతాన్ని మహిళలు భక్తిశ్రద్ధలతో ఆచరించారు. పల్లగిరి గట్టుపై ఉన్న త్రిశక్తి పీఠంలోని కనకదుర్గ, కనకమహాలక్ష్మి, జ్ఞానసరస్వతీ అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. పలు రకాల పుష్పాలతో విశేష అర్చనలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు, 54 కిలోల పసుపు కొమ్ముల అభిషేకం, సామూహిక కుంకుమార్చనలు చేశారు. మాగల్లులోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో రాజ్యలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. నందిగామలోని వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారిని వరలక్ష్మీ దేవిగా అలంకరించి పూజలు చేశారు. మరిడీ మహాలక్ష్మి అమ్మవారి ఆలయం వద్ద మహిళలకు పసుపు, కుంకుమ, గాజులు, పూలు, ప్రసాదాలను పంపిణీ చేశారు.

ఆలయాలకు శ్రావణ శోభ



వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న మహిళలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పెనుగంచిప్రోలు: శ్రావణమాసం మూడో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం సందర్భంగా మండలంలోని ఆలయాలు శ్రావణ శోభను సంతరించుకున్నాయి. పెనుగంచిప్రోలులో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మవారిని ప్రత్యేకంగా పూలతో అలంకరించి పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకుని బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు వారి గృహాల్లో లక్ష్మదేవిని విశేషంగా అలంకరించుకుని విశేష పూజలు, వ్రతాలు ఆచరించారు. భర్త పాదాలకు నమస్కరించి ఆశీర్వచనాలు తీసుకున్నారు. మహిళలు ఒకరికొకరు పసుసు-కుంకుమ, పండ్లు, పూలు, గాజులు, జాకెట్ ముక్కలు, చీరలు ఇచ్చిపుచ్చుకున్నారు.

కొట్టుకుపోతున్న వ్యక్తిని రక్షించిన పోలీసులు



బాధితుడు పాపారావుతో అధికారులు

వీరులపాడు: మండలంలోని పల్లంపల్లి వద్ద వైరా కట్టలేరులో వరద ఉధృతికి కొట్టుకుపోతున్న వ్యక్తిని పోలీసులు, స్థానికులు రక్షించి ఒడ్డుకు చేర్చిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. మండలంలోని వీఅన్నవరం గ్రామానికి చెందిన దొండపాటి పాపారావు ఉదయం సమయంలో ద్విచక్రవాహనంపై దాములూరు నుంచి పల్లంపల్లి వస్తున్నాడు. ఈ క్రమంలో వరద ఉధృతి ఒక్కసారిగా పెరగడంతో ద్విచక్రవాహనం కొట్టుకుపోయింది. గమనించిన స్థానికులు, హెడ్‌కానిస్టేబుల్ కృష్ణయ్య, పోలీస్ సిబ్బంది వరదలో కొట్టుకుపోతున్న పాపారావును తాడు సహాయంతో సురక్షితంగా ఒడ్డుకు చేర్చడంతో తృటిలో ప్రాణాపాయం తప్పిందంటూ స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.

'రాఖీ' శుభాకాంక్షలు



జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట నియోజకవర్గ ప్రజలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు రాఖీ పండుగ శుభాకాంక్షలను తెలియజేశారు. సోదరుడు-సోదరిల అనుబంధానికి ప్రతీకగా నిలిచిన రాఖీ పండుగను ప్రజలంతా ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షిస్తున్నట్లు శుక్రవారం ఆయన ఒకప్రకటన విడుదల చేశారు.

విగ్రహ తొలగింపు హేయమైన చర్య

కంచికచర్ల: అధికారమదంతో టీడీపీ గూండాలు రెచ్చిపోయి అర్ధరాత్రి సమయంలో మహానేత, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహాన్ని తొలగించడం హేయమైన చర్య అని వైఎస్సార్‌సీపీ మండల, పట్టణ పార్టీ అధ్యక్షులు బండి మల్లికార్జునరావు, వేమా సురేష్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రానున్న రోజుల్లో మహానేత విగ్రహాన్ని తొలగించిన ప్రదేశంలో నెలకొల్పుతామని తెలిపారు. టీడీపీ గూండాలు పోలీసుల సహకారంతో వైఎస్ విగ్రహాన్ని ధ్వంసం చేయడం అత్యంత బాధాకరమని అన్నారు. అధికారం శాశ్వతమనే రీతిలో ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడుతున్న టీడీపీ నేతలకు భవిష్యత్‌లో ఇదేరీతిలో గట్టిగా బుద్ధిచెబుతామని హెచ్చరించారు.

మహనీయుల త్యాగాలు సదా స్మరణీయం

విజయవాడ కల్చరల్: మహనీయుల త్యాగాలు సదా స్మరణీయని తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు అన్నారు. ఆలిండియా ఘంటసాల చైతన్యవేదిక, శ్రీ కళాభారతి, తెలుగు కళావాహిని ఆధ్వర్యంలో స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా భారత దేశం-నాడు- నేడు అంశంగా సదస్సు, దేశ భక్తి గీతాల కార్యక్రమాన్ని గాంధీనగర్‌లోని కొతా పూర్ణానందం కళావేదికమీద శుక్రవారం నిర్వహించారు. చిట్టిబాబు మాట్లాడుతూ నేటి భారత దేశం అగ్రదేశాలను సహితం శాసించేస్థితికి చేరుకుందని తెలిపారు. మహనీయుల త్యాగాలతో వచ్చిన స్వాతంత్ర్య లక్ష్యాలను కాపాడుకోవాలన్నారు. ఘంటసాల చైతన్యవేదిక అధ్యక్షుడు కోట వెంకటేశ్వరెడ్డి గాయనీ గాయకులు మల్లాది స్వాతి, టి. శ్రీనివాసరెడ్డి, దుర్గానాగమణి పాల్గొన్నారు.

ట్రాక్టర్‌పై ప్రభ ఊరేగింపు



కంచికచర్ల: శ్రావణ మాసం మూడవ శుక్రవారాన్ని కంచికచర్ల మండల ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మహిళలు వరలక్ష్మి వ్రతం ఆచరించడంతోపాటు కుంకుమ పూజలు చేశారు. స్థానిక మహాలక్ష్మి అమ్మవారికి మహన్యాసపూర్వక అభిషేకాలు, నీరాజన మంత్ర పుష్పములు, అష్టోత్తర పూజలు చేశారు. కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో వరలక్ష్మీవ్రతాన్ని ఆచరించారు. ఇందిరాకాలనీలో కొలువై ఉన్న అమ్మవారిని ట్రాక్టర్‌పై ప్రభ ఏర్పాటు చేసి ఊరేగించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కాలవ నాగేశ్వరరావు, వాసుదేవరావు, జనార్దన్‌రావు వారి కుటుంబసభ్యులు అమ్మవారికి పూజలు చేశారు. మండలంలోని మోగులూరు, పరిటాల, గనిఆత్కూరు, కొత్తపేట, కీసర, గండేపల్లి తదితర గ్రామాల్లోని మహిళలు వరలక్ష్మీవ్రతం ఆచరించారు.